యిష్టంమీద ఒక జాబితాను ఈ తరగతులవారిగా తయారుచేద్దాం. దానిలోని వరుసక్రమంగా మన సమస్య పరిష్కారం అవుతుంది. సభ్యులు యీ శాంతి సమరంలో ఏమాత్రం వెనుకంజ వెయ్య కూడదు.

అతి ప్రశాంతంగా ఊరేగింపుగా బయలుదేరి మన పదకాన్ని ప్రప్రథమంగా ఆచరణలో పెట్టి మన కష్టాన్ని ప్రభుత్వానికి మహజరు మూలకంగా తెలియ పరుచుకున్న హైదరాబాద్ శాఖవారికి మన జోహారులు. పశ్చిమ బెంగాల్ శాఖవారు కూడా కలకత్తా యసంబ్లీ ముందు తమ వాంఛల్ని ప్రద ర్శించినట్లు మనకు వార్తలు చేరాయి. వారికి మన అభివందనాలు శాంతిమార్గాన్ని ఎప్పుడూ విడిచిపెట్టవద్దని అందరినీ హెచ్చరిస్తున్నాను.

ఇక మరో ముఖ్యవిషయం. పాతిక సంవత్స రాలలోగా మనం ఉద్యోగాలలో ప్రవేశించా లని ప్రభుత్వానికి ఒక నిబంధన ఉందిట. ఈ నిబంధన కేవలం అన్యాయం. ఆ వయస్సులోగా ఉద్యోగంలో చేరకపోవటం మన తప్పుకాదు. మనకి ఉద్యోగం దొరికితే ఏనాడో ప్రవేశించే వాళ్ళం. ఇందులో మన తప్పు ఏమీలేదు. కనుక యీ నిబంధనని మనమీద ప్రయోగించడం చాలా అన్యాయం. నిరపరాధుల్ని శిక్షించడం అనేదానికి యిది తార్కాణం. కనుక ఈ నిబంధ నని వెంటనే తొలిగించి మనకి న్యాయం సమ కూర్చడం ప్రభుత్వ కర్తవ్యం. ఈ విషయాన్ని మనశాఖ లన్నింటికీ మన నినాదాల్లో దీనినీ ఒక దానిగా చేర్చుకోమని తెలియపరచండి. ఇక మనం ఉపన్యాసాల అవస్థను అధిగమించాం. పరిస్థితులూ, కార్యక్రమం అందరికీ అవగాహన అయిందని నమ్ముతున్నాను. ఆ ప్రకారం ప్రతి సభ్యుడూ కార్యక్రమం కొనసాగిస్తాడని విశ్వ సిస్తున్నాను. శలవు నమస్తే!

“మీకోసం కలంపట్టి,
ఆకాశపు దారులంట
అడావుడిగ వెళిపోయే,
అరుచుకుంటూ వెళిపోయే
జగన్నాథు రథచక్రాల్
రథచక్ర ప్రళయఘోష
భూమార్గం పట్టిస్తాను!
భూకంపం పుట్టిస్తాను!”

—“పూభా”

కథానిక

# తప్పిపోయిన నరకం

ముద్దంశెట్టి హనుమంతరావు

మోహన్ ఎనిమిదేళ్ళ మెదడులో యేవో వున్నతమైన వుద్దేశాలు, భావాలు, రేకెత్తి నయ్. అప్పుడే అతనికి జీవితంపై విరక్తి పుట్టి నట్టుంది. స్వేచ్ఛలేదు-సుఖంలేదు - ఆనందంలేదు. బాల్యావస్థలో తక్కినవారందరూ పొందుతూన్న అనుభూతులకు, ఆనందాలకూ అతడు దూరమౌ తున్నాడు. ఇటు కన్న తలిదండ్రులు, అటు పెంపకపు తలిదండ్రులమధ్య నలిగిపోతున్నాడు. తనుమాత్రం యేంచేస్తాడు?

మోహన్‌కు ఆరవయేడు ప్రవేశించగానే అతని పినతండ్రి రామారావు తనకు పిల్లలు లేనందున మోహన్‌ను పెంచుకున్నాడు. రామారావుభార్య లక్ష్మీదేవికూడా మోహనంటే యెంతో ముద్దుగా చేరదీస్తుండేది. మోహన్ తండ్రి జగన్నాథరావు ఆ దంపతుల ఆసక్తి కుర్రవాడియందుగల ప్రేమ గమనించి దత్తతీయటానికి ఒప్పుకున్నాడు. పోనీ పిల్లలులేరుకదా పెంపకంయిస్తే మాత్రం యెక్క డికిపోతాడు ఒకే కుటుంబంలో వున్నవాడు- అనుకున్నాడు.

మొదటి రోజుల్లో మోహన్ అతిగారా బంగా పెంచబడ్డాడు. ఏది యెప్పుడు కోరితే అది తెచ్చియిచ్చేవాడు రామారావు. మోహన్ అప్పట్లో తనతండ్రికంటె చిన్నాన్నే మంచి వాడని అనుకున్న రోజులుకూడా లేకపోలేదు. కాని యిప్పుడెందుకిలా మారిపోయాడో అర్థం కాలేదా చిన్నహృదయానికి. మొదట్లో యేదడి

గినా దగ్గరకుతీసుకొని లాలిస్తూ తెచ్చిపెట్టేవాడు. ఇప్పుడో? అడిగిన వెంటనే కసురుతూ కొట్టేందుకూడా సిద్ధమవుతున్నాడు. అతని మార్పుకు కారణం తెలుసుకోవాలని అనుకుంటున్నా అంతు చిక్కకుండా వుంది. పిన్నికూడా మొదట్లో ముద్దుగా చూస్తుండేది. యిప్పుడు యెప్పుడూ ముఖం చిట్లించుకునే వుంటుంది. భోజనం అడిగినంతవరకు పెట్టదు. ఒక్కొక్కసారి అడిగినప్పుడు కోపగించుకోవటం కూడాకద్దు.

దీనికంతకూ కారణం రామారావు భార్య యిన్నాళ్ళకు బిడ్డను కనడమని పాపం అతనికేం తెలుసు? దైవకృపే అనండి, మోహన్ దురదృష్టమే అనండి, మోహన్‌ను పెంచుకున్న యేణ్ణర్థం తరువాతనే రామారావు భార్య మగబిడ్డని కన్నది. దంపతులు అంతులేని ఆనందాన్ని పొందారు. కాని జగన్నాధరావు దంపతులు, తక్కిన బంధువుల హృదయాలు ముకుళించుకుపోయినయ్. మోహన్‌గతి యేమవుతుందా-అన్న భయంపట్టుకుంది జగన్నాధరావుకి. ఇక వుపేక్షిస్తే లాభంలేదనుకుని రామారావుకోసం కబురంపాడు. ఆ సాయంకాలమే రామారావు రావటం జరిగిందికూడా.

“ఏమోయ్ రామం! మోహన్ విషయంలో నువ్వేం ఆలోచించావ్? వాడు చదువూ, సంధ్యా లేకండా తిరుగుతున్నాడు. ఇప్పుడు వూరుకున్నామా, భవిష్యత్తు పాడవుతుంది. ఏదో స్కూల్లో జాయిన్‌చేయించాలి” అన్నాడు జగన్నాధరావు కుర్చీలో కూర్చుంటూ. “నేనూ అదే ఆలోచిస్తున్నానన్నయ్యా! అందుకే ప్రయివేటు చెప్పిస్తున్నాగా. యీ సంవత్సరం స్కూల్లో జాయిన్ చేయించా లనుకొంటున్నాను. నాకు మాత్రం తెలీదూ! మీరు చెప్పాలా?” అదీ రామారావు జవాబు.

అంతకంటె స్పష్టంగా యింకెలా చెప్పాలో జగన్నాధరావుకు అర్థంకాలేదు. అంతటితో ఆ విషయాన్ని కట్టిపెట్టి మరికొన్ని యితర విషయాలు చర్చ సాగించినతర్వాత రామారావు ఇంటిముఖం పట్టాడు.

ఋతువు మారింది. మోహన్ స్కూల్లో చేర్చబడ్డాడు. కాని చదువుమాత్రం అలానే వుంది. ఇంటికివచ్చిన తరువాత పుస్తకంపట్టి చదివిన పాపానపోలేదు. తీరుబడేదీ? పిన్ని వంట ప్రయత్నంలో వుంటే చిట్టిపాపను యెత్తుకుని ఆడించాలి మోహన్. ప్రతీరోజు దేనికో ఓదానికై బజారుకు పంపుతూనే వుంటుంది. ఎలా కాదంటాడు? కాదంటే విరుచుకుపడుతుంది. పోనీ-బజారంటే చేస్తాడుగాని యింటిదగ్గరున్నప్పుడు చంటిపాపను యెత్తుకుంటే చదువుకునే దెప్పుడు?

విధిలేక పేరుకి మాత్రం చదువుతున్నాడు మోహన్. స్కూల్లో విన్నదే వంటబడుతుంది అతనికి. పరీక్షలు దగ్గరపడుతున్నయ్, తనకంటె చిన్నవాళ్ళు తనక్లాసులో వుండటం, వారికంటె తను చదువులో వెనకపడ్డం మోహన్ చిన్నతనమనిపించింది. పరీక్షల్లోనైనా, వారికంటి ఎక్కువ మార్కులు తెచ్చుకుని పాసవ్వాలనుకున్నాడు. ఏరోజు యీ ఆలోచన అతని అంతరాత్మకు తట్టిందో, ఆ రోజునుండి కొద్దిగా వెటకారంగా ప్రవర్తించటం మొదలుపెట్టాడు. స్కూలునుండి వచ్చింది మొదలు పుస్తకంపట్టుకు కూర్చుండేవాడు. ఇది లక్ష్మీదేవి (పిన్ని)కి భరించరాని ఆవేదనయింది.

ఓరోజు మోహన్ చదువుతూవుంటే వాళ్ళ పిన్ని పాపను యెత్తుకోమంది. ఆమె యేదో పనిలోవుండి యెత్తుకోమంటే అర్థం వుంది. నిద్రపోతూ పాప నెత్తుకోమంటే మోహన్‌కు అరికాలి మంట తల కెక్కింది.

“ఇవ్వాళ నేను చదువుకోవాలి పిన్నీ, పరీక్షలు దగ్గరపడుతున్నయ్. ఎప్పుడూ నేను తమ్ముణ్ణి యెత్తుకునివుంటే యెలా పాసవుతాను?” ఆ అమాయకపుహృదయంలో అణగివున్న కోపాన్ని ఒక్కసారి వెలిబుచ్చాడు. తన అభిమానం దెబ్బతిన్నదానిలా ఆమె ఛటుక్కున వచ్చి తన చేతికొచ్చినట్టు మోహన్‌ని కొట్టింది. ఏడుస్తూ కొట్టవద్దని ఆమెచేతులు పట్టుకున్నా, ఆమె కసితీర్చుకుంది ఎందుకో ఆమెకంతకోపం? ఎందుకో అంత అసూయ, చదువుకుంటున్న వాణ్ణి ఆటంకపర్చటం ఆనందమేమో - బాగుపడ ప్రయత్నించినవార్ని భంగపర్చటం మానవలక్షణమేమో! మోహన్ వెక్కి వెక్కి ఏడుస్తుంటే, అతనికన్నీటితో చదువుతున్న పుస్తకం సగం తడ్సింది. కన్నతండ్రి యింటికి అప్పుడే పోవాలనుకున్నాడుగాని పినతండ్రివచ్చి ఆమెను తప్పక వారిస్తాడనీ దూషిస్తాడనీ నమ్మాడు.

రామారావు యింటికి వచ్చాడు. మోహన్ యింకా ఏడుస్తూనేవున్నాడు. తిన్నగా భార్య దగ్గరకుపోయాడు.

"ఎందు కేడుస్తున్నాడు?" అడిగాడు.

"నాన్నడిగితే నేనేంచెప్పతాను? వాణ్ణే అడగండి-మీరు మరింత నెత్తి నెక్కించుకుని త్రిప్పితే బావుంటుంది. ఇదే కారణం పిల్లలు చెడిపోయేందుకు."

"అసలు యేమయిందో చెప్పకండా నీధోరణి నీదే నేమిటీ?"

"అయ్యో దేముంది—'నేను పనిలోవున్నానాయనా కొద్దిగా పాపనుతీయ్' అన్నా అంతే! ఛ, ఛా! ఆరునూరైనా పాపను మరెత్తుకోనని నిర్మొహమాటంగా జవాబిచ్చాడు. వాడికి చదువు పోతుందట. అయినా మన పిల్లవాణ్ణి వాడెందు కెత్తుకుంటాడు? మనం వూరికే అభిమానంతో ప్రాకులాడ్డమేగాని" అని ఓ చిన్న ఉపన్యాసం యిచ్చేసింది. రామారావుకి యిదంతా ఓ కలలా కన్పించింది. మోహన్ని యే మనటానికి మన సొప్పకుండా వుంది. మౌనంగా నేలవేపు చూస్తున్నాడు. "...వాడికిమాత్రం తెలీదూ! అథవా నేనూ మీతో చెప్పినా వాడి విషయంలో మీరు జోక్యం కలిగించుకోరని, నాకు మాటకుమాట జవాబిచ్చే తాహతుకూడా వచ్చింది. వాడికి నేనంటే అంత నిర్లక్ష్యం. నాకింకేం అభిమానం వుంది చెప్పండి? బెల్లంకొట్టిన రాయిలా వూరుకుంటారేం?" అంటూంటే చంటిపిల్లాడి యేడుపు విని పోయి యెత్తుకుంటూ—

"ఎందుకురా యీ యేడుపు? నిన్నెత్తుకుంది కింకెవరున్నారు? నేనేగా- అటు యింటిపనులే చేస్తానా? యిటు నీ గోలే వింటానా?" అంది గట్టిగా భర్తకు వినిపించేట్లుగా. రామారావు ఆ మాటలు విన్నతరువాత మత్తెక్కినట్టయింది.

మారుమాటాడకండా తిన్నగా మోహన్ దగ్గరకు పోయాడు. జేవురించిన చిన్నాన్న ముఖం చూడంగానే మోహన్కు భయంపుట్టింది. వణుకుతున్న చేతులతో పుస్తకాల్ని సర్దుతున్నాడు. రామారావు చరచరా పోయి—

"ఏంరా మోహన్-పోతులా మూడుపూటలూ తిని, పాపనెత్తుకోమంటే మరి ముట్టుకోనన్నావటగా?"అన్నాడు కోపంగా.

"అలాగనలేదు చిన్నాన్నా! నాకు పరీక్షలు దగ్గరపడుతున్నయ్, చదువుకోవాలని అన్నాను, యింతకుముందెప్పుడూ ఎత్తుకుంటునేవున్నాగా" వణుకుతున్న పెదవులమధ్యనుండి వెలువడ్డాయి యీ మాటలు. మరొకరెవరైనా వింటే హృదయాన్ని ద్రవింపచేస్తాయి. రామారావుమాత్రం చెక్కుచెదరలేదు. అతనికి భార్య చెప్పిన మాటల్లో కొంత సత్యం గోచరించింది. లేకలేక పుట్టిన కొడుకును తామంత ముద్దుగా పెంచుకుంటుంటే, మోహన్కు అసూయ పుట్టిందేమోనన్న దురభిప్రాయం అతని మెదడులో మెదిలింది. ఆ ఉద్రేకంలో మరో నాలుగు లెంపమీద వాయించాడు. పాపం! మోహన్ బయట కేడ్చేందుకు శక్తిలేనట్టయిపోయాడు. అతని యేడుపు యెవరు వింటారు?

ఉదయం లేచాడు. ఒళ్ళంతా నొప్పిగావుంది. నడువలేకపోయాడు కూడా.

* * *

మామూలుగా స్కూలుకి వెళ్ళిరావటంమాత్రం జరుగుతూంది. యథాప్రకారంగా యింట్లో చదువు సున్నా. ఎప్పుడూ చంటి పిల్లాణ్ణి ఆడిస్తుంటే సరిపోయేది. అంతకుముందే భయపెట్టింది పిన్ని—కన్నతల్లితో యీ విషయాలేవి చెప్పినా మరింత దెబ్బలు తగులుతాయని. అందుకే కన్నతలిదండ్రులెన్నిసార్లు అడుగుతున్నా బాగా చదువుతున్నాననే చెపుతూండేవాడు.

పరీక్షలువచ్చాయి. జ్ఞాపకం వున్నంతవరకు వ్రాశాడు మోహన్. పరీక్షలవుతున్న రోజుల్లో అతని ముఖం యెప్పుడూ దైన్యంతో నిండివుండేది. ఎవరికీ తెలియని బాధ అతన్ని లోలోన బాధిస్తుండేది. ఫలితాలు తెలిశాయి. మోహన్ పరీక్ష తప్పిపోయాడు. కన్నతలిదండ్రుల కడుపు కరిగిపోయింది. వారి హృదయాలు దుఃఖపూరితమయ్యాయ్. పది సంవత్సరాల వయసులో అయిదవ తరగతి ప్యాసుకాలేకపోతే ముందుముందు పెద్ద క్లాసుల్లో యెలావుత్తీర్ణుడవుతాడో అర్థంకాలేదు. జగన్నాధరావుకి.

రామారావు మోహన్ని వెంట తరుముకొచ్చాడు, జగన్నాధరావు యింటికి. అప్పటికి జగన్నాధరావు యింట్లోనే వున్నాడు. "చూశావన్నయ్యా! యింతకష్టపడి చదివించినందుకు ఫలితం

శూన్యం. మేం పస్తులుండయినా, యెన్నో కష్టాలు పడి యీకుర్రాణ్ణి చదివిస్తే యేమైనా ఫలితం వుందా? ఎలావుంటుంది? యెప్పుడైనా చదువు తేగా ఇంట్లో ఒక్క నిముషం వుండటం కష్టంగా వుండేది. ఏమున్నా నేనున్నప్పుడే వుండేవాడు. అసలు వాళ్ళ పిన్నిని గడ్డిపోచతో సమానంగా చూస్తాడు. అథవా యేమైనా అడిగిందా తిరిగి జవాబు. యీపరిస్థితుల్లో యెలా పాసవుతాడు చెప్పండి? మనం స్కూలుకు రుణమున్నట్టు జీతం కట్టాం. అందరితోనూ యేమని చెప్పేవాడో తెలుసా? యింట్లోపనులు చెప్పేవారమనీ, చంటిపాపను యెత్తుకోమనేవారమనీ, యింకేమేమో-" అంతటితో ముగించాడు.

జగన్నాధరావు, యిందులో కొంత అసత్యం ఇమిడివుందని తెలుసుకోగలిగాడు. తెలిసినా నిదర్శనాలు లేంది యెలా తమ్ముడిముందు నిక్కచ్చితంగా అడిగేస్తాడు? అసలు యేమనటానికీ యిష్టంలేక మౌనం వహించాడు. మోహన్ తల్లిని చుట్టుకుని అలానే కూర్చున్నాడు. రామారావు బయలుదేరుతూ,

"పదరా మోహన్! యిప్పటికే చాల పైమయింది" అంటూ నిల్చున్నాడు.

"ఇప్పుడు నేనురాను చిన్నాన్నా! రేపు వుదయంవస్తా" అన్నాడు నిర్భయంగా కన్నతల్లి ఒడిలో ఒరుగుతూ.

"సరే" అంటూ నడిచాడు రామారావు.

రామారావు వెళ్లిపోయిన తరువాత జగన్నాధరావు కొడుకుని దగ్గరగా పిల్చాడు.

"కౌను బాబూ! యెలాపరీక్షపోయిందీ? యీ చిన్న క్లాసులోనే యిలా అయితే ఎంత అమర్యాద! నీకెంత కష్టం!"

"చిన్నాన్నగారింట్లో నేనుంటే ప్రతి సంవత్సరం యింతేనాన్నా— నేను మరక్కడికి పోను" అనవలసింది ధైర్యంగా యిప్పటికనగలిగాడు.

"ఏం? యేం జరిగింది?" అనుకుంటూ దగ్గరగా వచ్చింది తల్లి.

"నేనెప్పుడు చదివేదమ్మా? ఎప్పుడూ పాపనెత్తుకుందుకు సరిపోయేది. అలా ఓసారి యెత్తుకోనని యెదిరించానని పిన్ని నన్ను పచ్చడి చేసింది. చిన్నాన్నకూడా అంతేనమ్మా..."

"మాకెందుకు చెప్పలేదురా" అంది మధ్యలో విలపించే కంఠంతో తల్లి.

"లేదమ్మా-మీతో చెబితే ఇంకా నన్ను తన్నిస్తానంది. చిన్నాన్నకూడా ప్రతి మాటకు విసుక్కుని కసురుతూ వుంటారమ్మా - అక్కడుండి ఎలాచదివేది చెప్పమ్మా!" బావురుమంటూ తల్లిపై కొరిగాడు మోహన్.

తల్లి హృదయం ద్రవించిపోయింది. కన్నకొడుకుని పెంపకానికిచ్చి యిన్ని కష్టాలు పాలు చేసినందుకు తన్ను తానే నిందించుకుంది. భర్త వేపు తిరిగింది.

"విన్నారండీ! మీ తమ్ముడుగావించిన ఘనకార్యం-ఏం తనకంత యిష్టంలేనపుడు మనకు తెచ్చి అప్పజెప్పేస్తే బావుండేది. అకారణంగా మధ్య వాణ్ణి బాధించటం యెందుకు?"

"అయిందేదో అయిపోయింది. వీడి భావి జీవితంగూర్చి ఆలోచించాలి. ఓ సంవత్సరంపాటు స్కూలు మాన్పించేసి ప్రయివేటు చెప్పించి మళ్ళీ స్కూల్లో ప్రవేశపెడితే బాగుంటుంది. ఎలాగో తంటాలుపడాలి మరి. ఇరువురి మధ్య పడి నలిగిపోయాడు."

"చాలిక-వీడి బట్టలు, పుస్తకాలు తెచ్చేయండి. దత్తతనాడు వ్రాయించిన పత్రంకూడా అడిగిపుచ్చుకోండి. మీ తమ్ముడేంచెప్పినా మెత్తపడొద్దు సుమా! రేపే వెళ్ళండి" అంది తల్లి కోపంగా. ఆ మాట వినగానే మోహన్ సంతోషంతో గంతేసి తలుపుదగ్గరున్న అక్కదగ్గరకు పోయాడు.

"చూశారా! వాడి ఆనందం! ఆ నరకంనుండి బయటపడ్డానని గామోసు" అంది భర్తతో మోహన్ తల్లి.

"ఇప్పుడు బుద్ధివచ్చిందిలే మనకి. వెళ్లి వాడి కన్నం పెట్టు" అంటూ తనగదికి పోయాడు జగన్నాధరావు.

